జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## వరంగల్

ములుగు - మహబూబాబాద్
జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

మంగళవారం | 31 | మార్చి | 2026 ◆ పేజీలు : 8



## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 30 (ప్రజాజ్యోతి) :** ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన

మిగతా 2 లో...



## జియో కోఆర్డినేషన్లతో భూముల హద్దులు నిర్ణయించాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** మల్లంపల్లి మండలం రామ చంద్రపూర్ గ్రామంలోని భూములకు జియో కో ఆర్డినేషన్ తో హద్దులు నిర్ణయించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర అన్నారు.సోమవారం మల్లంపల్లి మండలం రామ చంద్రాపూర్ రైతు వేదికలో జిల్లా కలెక్టర్ దివాకర సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..రామచంద్రా పూర్ గ్రామంలో రీసర్వే చేపడుతున్న 10580 ఎకరాల భూమిని క్షుణ్ణంగా సర్వే చేయాలని,ప్రతి రైతు భూములను సర్వే నిర్వహించి జియో కో ఆర్డినేషన్ ద్వారా హద్దులు నిర్ణయించాలని తెలిపారు. సర్వేయర్లు రైతులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సర్వే పూర్తి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ములుగు ఆర్డీఓ వెంకటేష్, తహశీల్దార్ విజయభాస్కర్, సర్వే ఏడి కుసుమ కుమారి,డిప్యూటీ ఇన్స్పెక్టర్ సతీష్ చంద్ర,ఆర్ఐ విజేందర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఐఆర్సీ నియమాలను తప్పనిసరిగా పాటించాలి

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 30 (ప్రజాజ్యోతి) :** ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ ప్రకారం రోడ్డు భద్రత ప్రమాణాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రహదారి భద్రతపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హైవే పై ఐఆర్సీ నియమ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. అలాగే హైవేపై అనుమతి లేని హోర్డింగ్ లు ఉండకూడదన్నారు. జనగామ పట్టణంలో రోడ్ లకు ఇరువైపులా ఎలాంటి అమ్మకాలు జరగకుండా, ట్రాఫిక్ కు ఇబ్బందులు తలెత్తకుండా, సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పనులు త్వరగా పూర్తి చేసి, అందులో అమ్మకాలు నిర్వహించుకు నేలా చూడాలని ఆదేశించారు. ఘనపూర్ స్టేషన్ జంక్షన్ ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా లోని అన్నీ పాఠశాలల వద్ద వేగ నియంత్రికలను తనిఖీ చేయాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులచే

మిగతా 2 లో...

## విధుల్లోనే విషాదం.. గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి



**పర్వతగిరి, మార్చి 30 (ప్రజాజ్యోతి)** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. విధులు నిర్వహిస్తూనే ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని టూక్యా తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ (46) సోమవారం ఉదయం సాధారణంగా పాఠశాలకు హాజరయ్యారు. తరగతులు నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే ఆయనను నెక్కొండలోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడు సంగెం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందినవారని తెలిసింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ప్రజావాణి కార్యక్రమానికి 138 అర్జీలు



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 30, (ప్రజా జ్యోతి):** ప్రజావాణి అర్జీలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మెయిన్ కాన్ఫరెన్స్ హలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు అదనపు కలెక్టర్ ఎన్. రవి లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ స్వీకరించారు. అర్జీలను అందిస్తూ ప్రజలు సమస్యలపై వివరాలు తెలియజేయగా కలెక్టర్ ఓపికగా విన్నారు. ప్రజావాణి సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే జిల్లా అధికారులతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 138 అర్జీలు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి జిల్లా రెవెన్యూ అధికారి సత్య పాల్ రెడ్డి, డీఆర్డీవో మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి...)

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా 232 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐఆర్సీ నియమాలను తప్పనిసరిగా పాటించాలి

(మొదటి పేజీ తరువాయి...)

రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డివోలు గోపీరాం, వెంకన్న, ఆర్ అండ్ బీ ఈఈ స్వరూప, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, ఎక్సైజ్ అధికారి అనిత, ఈఈ పీఆర్ శ్రీనివాస రావు, డీఎంహెచ్ఓ మల్లికార్జున్ రావు, ఆర్టీఏ మెంబర్ అభి గౌడ్, మున్సిపల్ కమిషనర్ లు మహేశ్వర్ రెడ్డి, రాధ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తూ అవినీతికి పాల్పడుతున్న కార్యదర్శి పై చర్య తీసుకోండి



**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 29 ( ప్రజాజ్యోతి ) :** జనగామ జిల్లా నర్మెట్ట మండల కేంద్రంలో గత మూడు సంవత్సరాలుగా గ్రామ కార్యదర్శిగా కందగట్ల శ్రీధర్ విధులు నిర్వహిస్తున్నారని, తనది సొంత ఊరు అదే గ్రామపంచాయతీ అయినప్పటికీ పంచాయతీరాజ్ శాఖ నిబంధనల ప్రకారం సొంత ఊరులో విధులు నిర్వర్తించకూడదని నిబంధన ఉన్నప్పటికీ సొంత ఊరిలో కార్యదర్శిగా గత మూడు సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నాడని, ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని పథకాలకు సంబంధించి అవినీతికి పాల్పడుతూ అర్హులైన వారికి పథకాలు అందకుండా అవినీతికి పాల్పడుతున్నాడని, గృహ నిర్మాణ అనుమతులకు, అక్రమాలకు పాల్పడుతున్నారని, సంబంధిత శాఖ వారిచే విచారణ జరిపి అక్రమ సొమ్మును రికవరీ చేసి గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించగలరని, సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో నర్మెట్ట గ్రామ పంచాయితీకి చెందిన పులి రేణుక జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు ఫిర్యాదు చేయడం జరిగినది.

## మత్తు పానీయాల నివారణపై కళాజాత బృందం అవగాహన.



**ప్రజాజ్యోతి–మల్హార్ రావు, మార్చి 30.** భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, డిపిఆర్ఓ ఆదేశాల మేరకు మండలంలోని కొయ్యూరు గ్రామంలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి సెగ్గం శిరీష కళాబృందంచే మత్తు పానీయాల నివారణ,ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పరిసరాల పరిశుభ్రత,రోడ్డు భద్రతపై కళాజాత ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు సెగ్గం శిరీష,జాడీ సుమలత,పులి రాధిక,చిలుముల మధుబాబు,కాస స్వాతి,ఆత్మకూరు మహేందర్,కమ్మల ప్రవీణ్ కుమార్,గడ్డం నాగమణి,ఓన పాకాల కుమార్,సోదారి సురేందర్,చీకట్ల శంకర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ బోళ్ల యాద లక్ష్మి శివకుమార్ అధ్యక్షతన ఘనంగా పౌర హక్కుల దినోత్సవం



**నెక్కొండ, మార్చి 30 (ప్రజా జ్యోతి):** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ బోళ్ల యాద లక్ష్మి శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెక్కొండ మండల డిప్యూటీ తహసిల్దార్ పల్లకొండ రవి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన ఫలాలను ప్రతి ఒక్కరూ ప్రశ్నించి పొందాలని, అప్పుడే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను, ఆయన ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, ముఖ్యంగా అంటరానితనం, కుల వివక్ష వంటి సామాజిక జాడ్యాల నిర్మూలనకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. మహిళలు, మహిళా సంఘాలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో చైతన్యం పొంది సమాజాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో పని చేయాలని స్పష్టం చేశారు. అనంతరం అందరితో పౌర హక్కుల ప్రతిజ్ఞ చేయించారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, సమానత్వ సాధనలో భాగంగా ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు కలిసి పాల్గొని సామరస్యాన్ని చాటారు. ఈ సందర్భంగా పలువురిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్ కుమార్, మండల అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ జాకబ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ భాగ్య, ఏఈఓ రాజేష్, పంచాయతీ సెక్రెటరీ రవి కుమార్, వరంగల్ జిల్లా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మరియు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాంకాల యాదగిరి, ఏఆర్ఐ సుధారాణి, ఏడబ్ల్యూటీ అదుయమ్మ, జూనియర్ అసిస్టెంట్ కే రాజేష్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం శ్రీధర్ రెడ్డి, సీసీ యాకాంబ్రం, ఉప సర్పంచ్ కాసీం, వార్డు సభ్యులు సూత్రపు సుధాకర్, గుండ్రపల్లి అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఇటికా ల సంజీవయ్య, అంబేద్కర్ కమిటీ సభ్యుడు నల్లగొండ సాంబరాజు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ యాకూబ్ హుస్సేన్ పదవీ విరమణ వీడ్కోలు సమావేశం



**పాలకుర్తి మార్చి30 / ప్రజా జ్యోతి /** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో ఎస్సై యాకూబ్ హుస్సేన్ పదవి విరమణ వీడ్కోలు సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు.యాకుబ్ హుషేన్ 1984లో సివిల్ కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరి, వివిధ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ పదోన్నతులు పొంది 2010లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2018లో ఏఎస్ఐగా, 2020లో ఎస్ఐగా పదోన్నతి పొంది తమ సేవలను విజయవంతంగా కొనసాగించారు. ఈ సందర్భంగా ఏసిపి అంబటి నరసయ్య మాట్లాడుతూ 2022లో పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐగా వచ్చి విధులు నిర్వహించి,తన సేవా కాలంలో 10 గుడ్ సర్వీస్ ఎంట్రీలు, 3 క్యాష్ రివార్డులు పొంది, ఎన్నికల విధులు, బందోబస్తు కార్యక్రమాలు వివిధ కేసుల దర్యాప్తులో నిబద్ధతతో పనిచేసి ప్రశంసలు పొందరని వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో కొనసాగా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జానకిరామ్ రెడ్డి, ఎస్సై పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధురాలికి చేయూతగా నిలిచిన సనాతన హిందూ సేవా సమితి సభ్యులు



**వరంగల్ సిటీ, మార్చి 30(ప్రజాజ్యోతి):** సనాతన హిందూ సేవా సమితి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా నగరంలోని ఉర్సు ప్రాంతంలో గల వృద్ధురాలికి అండగా నిలిచారు. ఏ ఆధారం లేక ఆరోగ్య సమస్యలు, మరియు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వృద్ధురాలు నల్ల పుష్ప లీల కు సోమవారం రెండు నెలలకు సరిపడా బియ్యం మరియు నిత్యావసరాలు అందించారు. ఇప్పటివరకు సమితి ద్వారా నూట డెబ్బై సేవా కార్యక్రమాలు అందించినట్లు గ్రూప్ వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్ తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, గ్రూప్ సభ్యులు బడుగు రాము, గంగిడి ధర్మారెడ్డి, ఆవునూరి రాజేష్, పేర్న భరత్, పెరుమాండ్ల శ్రవణ్, మాచర్ల దీనదయల్ తదితరులు పాల్గొన్నారు.

## పర్వతగిరి పీహెచ్ సీలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం



**పర్వతగిరి, మార్చి 30:** పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వర్ధన్నపేట ఫైర్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ఫైర్ ఎక్స్టింగ్విషర్ వినియోగ విధానం వంటి అంశాలను వివరించారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల సమయంలో రోగులు, సిబ్బంది సురక్షితంగా బయటపడే మార్గాలపై ప్రత్యేకంగా దృష్టిసారించారు.ఆరోగ్య కేంద్ర సిబ్బందికి ప్రాక్టికల్ డెమో నిర్వహించి, అత్యవసర పరిస్థితుల్లో చాకచక్యంగా స్పందించేలా శిక్షణ ఇచ్చారు. అగ్నిప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి రాయపర్తి మండల పర్యటన

**రాయపర్తి మార్చ్ 30 ప్రజాజ్యోతి** నేడు రాయపర్తి మండలంలోని వివిధ గ్రామాలలో పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి పలు కార్యక్రమాలలో పాల్గొని ప్రారంభిస్తారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమాల షెడ్యూలు తెలిపారు. ఉదయం:– 8.00 గంటలకు.. రాయపర్తి మండలం,వెంకటేశ్వర పల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించనున్నారు ఉదయం: 9.00 గంటలకు.. పానిస్ తండా గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించనున్న పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి.ఉదయం:– 9.30 గంటలకు రాయపర్తి మండల కేంద్రం లోని రైతు వేదిక కార్యాలయంలో పేదింటి ఆడబిడ్డలకు చేయూత నివ్వడమే లక్ష్యంగా కళ్యాణ లక్ష్మి & షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించనున్న ఎం ఎల్ ఏ ఉదయం 10.00 గంటలకు రాయపర్తి మండల కేంద్రం లోని రైతు వేదిక కార్యాలయంలో అర్హులైన రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించనున్నారు.మండలం ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు, గ్రామ పార్టీ అధ్యక్షులు,అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు యూత్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ధర్మసాగర్‌లో మండల పశు వైద్యాధికారి భూమయ్య ఆధ్వర్యంలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరం





**ధర్మసాగర్, మార్చి 30 (ప్రజా జ్యోతి):** ధర్మసాగర్ మండలం ధర్మసాగర్ గ్రామంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశువైద్యుడు డాక్టర్ భూమయ్య హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పశువులకు టీకాలు వేయడంతో పాటు చెవి ట్యాగింగ్ చేపట్టి నమోదు ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 78 పశువులకు టీకాలు ఇచ్చారు. ముఖ్యంగా గేదెలు, ఆవులలో ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో ప్రత్యేక శ్రద్ధతో టీకాలు వేశారు.ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ మండల పశు వైద్యాధికారి భూమయ్య వెటర్నరీ అసిస్టెంట్ వీరన్న గారు మరియు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ భూమయ్య ఎండాకాలంలో గేదెల సంరక్షణపై రై తులకు ముఖ్య సూచనలు చేశారు. అ ధిక ఉష్ణోగ్రతల సమయంలో గేదెలకు ,ఆవులకు తగినంత చల్లని నీరు, నీడ ఉండేలా చూడాలని, పచ్చి ఆహారం అందించాలని, శుభ్రత పాటించాలని సూచించారు. అలాగే గాలి కుంటు వంటి వ్యాధులను నివారించడానికి సమయానికి టీకాలు వేయించుకోవాలని రైతులకు తెలియజేశారు.ఈ శిబిరంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు. డాక్టర్ భూమయ్య సేవలను రైతులు ప్రశంసించారు.

## జగన్నాధ పూర్ ఆంజనేయస్వామి గుడి నూతన కమిటీ ఎన్నిక



**ఎల్కతుర్తి మార్చ్ 30 (ప్రజా జ్యోతి)** ఎల్కతుర్తి మండలం జగన్నాథ్ పూర్ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నూతన కమిటీని సోమవారం గ్రామ ప్రజల సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా పెండ్యాల భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా గూటం సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పంజాల కనకయ్య, మూటికే ఆగయ్య, కోశాధికారిగా గూడేటి యాదగిరి, గౌరవ అధ్యక్షులుగా పెండ్యాల స్వర్ణలత, ఆరెపల్లి భాగ్యలక్ష్మి, గౌరవ సలహాదారులుగా ఆరెపల్లి సమ్మయ్య, పెండ్యాల సామెల్, సహాయ కార్యదర్శులుగా పెద్ద బోయిన బిక్షపతి, ఉపగంటి సమ్మిరెడ్డి, ఆరేపల్లి రమేష్, కింసారపు సంపత్, సంయుక్త కార్యదర్శిలుగా శివరాత్రి మల్లయ్య, మేడుదుల రాములు, శివరాత్రి బిక్షపతి, పంజాల కుమారస్వామి, కార్యవర్గ సభ్యులుగా రాంపల్లి శ్రీనివాస్, ఆరెపల్లి తిరుపతి, ఎర్రం అభిరాష్ రెడ్డి, తూముల రమేష్, అంబాల శ్రీనివాస్, వడ్డేపల్లి అనిల్, మాటూరి శ్రీనివాస్, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు మాట్లాడుతూ, మాపై నమ్మకంతో నన్ను గ్రామ ప్రజలు ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆంజనేయ స్వామి గుడికి ఏదైనా సమస్యలు నా దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## ఘనంగా పౌర హక్కుల దినోత్సవం




**పలిమెల మార్చి 30 (ప్రజా జ్యోతి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల గ్రామపంచాయతీ పరిధిలోని అప్పాజీ పేట గ్రామంలో తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది సోమవారం రోజున ఘనంగా పౌర హక్కుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పౌర హక్కుల దినోత్సవ వేడుకలలో భాగంగా అప్పాజీపేట గ్రామంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరేష్ మాట్లాడుతూ ప్రజలలో ఎలాంటి కుల మత విభేదాలు కానీ సామాజిక అంతరాలు గాని లేకుండా జీవించాలని అవగాహన కలిగించిన అనంతరం గ్రామంలో ఎలాంటి వివక్ష చూప బోమని వారందరి చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, జిపిఓ సడవలి, మహేందర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మండల నూతన కమిటీల ఎంపికపై సమీక్ష సమావేశం

- హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 30, (ప్రజా జ్యోతి):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు, హనుమకొండ జిల్లా వ్యాప్తంగా పార్టీని క్షేత్ర స్థాయి నుంచి పటిష్టం చేసేందుకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియలో భాగంగా పాత కమిటీలను రద్దు చేసి, పారదర్శకంగా నూతన కమిటీలను ఎన్నుకునేందుకు నియమించబడిన అబ్జర్వర్లు కుందూర్ వెంకట్ రెడ్డి, పింగిలి వెంకట్ రెడ్డి, బిల్లా ఉదయ్ రెడ్డి, మదన్ గౌడ్, పి. సారంగపాణి గార్లతో కలిసి ఈరోజు వర్ధన్నపేట నియోజకవర్గం, ఐనవోలు మండల నాయకులతో మ్యాంగో ఫార్మ్ స్టే రిసార్ట్, ఐనవోలులో స్థానిక శాసనసభ్యులు కె.ఆర్.నాగరాజు ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలలో బిజీగా ఉన్న నేపథ్యంలో, వారి సూచనల మేరకు మరియు వారికి పూర్తి సమాచారం అందించి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ పటిష్టత కోసం ఐనవోలు మండల స్థాయి కమిటీలను పారదర్శకంగా, క్రియాశీలక కార్యకర్తలతో భర్తీ చేయడంపై అబ్జర్వర్లతో కలిసి లోతుగా చర్చించి ఆశావాహుల నుండి మండల కమిటీకి 51 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ "ప్రస్తుత మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, సొసైటీ చైర్మన్లు మరియు సీనియర్ నాయకులందరితో చర్చించి, అందరి ఏకాభిప్రాయంతోనే సమర్థవంతమైన కమిటీలను ఎన్నుకుంటున్నాము. ప్రజా సమస్యలపై పోరాడే వారికే ఈ కమిటీల్లో చోటు ఉంటుంది," అని స్పష్టం చేశారు. అబ్జర్వర్లుగా నియమితులైన కుందూర్ వెంకట్ రెడ్డి, పింగిలి వెంకట్ రెడ్డి, బిల్లా ఉదయ్ రెడ్డి, మదన్ గౌడ్, పి. సారంగపాణి గార్ల పర్యవేక్షణలో కమిటీల ఎంపిక ప్రక్రియ అత్యంత సమన్వయంతో సాగుతోందని, నూతన కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పించడమే కాకుండా, మహిళలకు 30% ప్రాతినిధ్యం తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల స్థాయి కార్యవర్గాల్లో 35 సంవత్సరాల పైబడిన, పార్టీ సిద్ధాంతాల పట్ల అవగాహన ఉన్న వారికే ప్రాధాన్యతనిస్తున్నట్టు, మండల అధ్యక్షులు, సభ్యులుగా కనీసం మూడు సంవత్సరాలు పార్టీలో చురుకైన పాత్ర పోషించిన వారినే ఎంపిక చేస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా పరిధిలో రెండు సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న మండల అధ్యక్షులను నిబంధనల ప్రకారం మారుస్తూ, కొత్త రక్తాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, మండల ముఖ్య నేతలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు శివ ప్రతాప్ శుక్లాకు సన్మానం



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 30, (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్టగవర్నర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివ ప్రతాప్ శుక్లాను సోమవారం లోక్‌భవన్ లో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్లు, రాష్ట్ర పాలకమండలి సభ్యులు, హనుమకొండ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి . విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ. వి. శ్రీనివాస్ రావు మర్యాద పూర్వకంగా కలిసి రెడ్ క్రాస్ సొసైటీ సెవెన్ ప్రిన్సిపుల్స్ షీల్డ్, భద్రకాళి శాలువ ప్రసాదం అందచేసి శుభాకాంక్షలు తెలియచేసి హనుమకొండ రెడ్ క్రాస్ ఏజీఎం పుస్తకం ఇచ్చి రాష్ట్ర రెడ్ క్రాస్ మరియు జిల్లాల సేవాకార్యక్రమాల గురించి వివరించడం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట గవర్నర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్రహ్మాండంగా సేవలు అందచేసినారు. ఇక ముందు కూడా జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సంపాదించాలని తెలిపారు. జూనియర్ మరియు యూత్ రెడ్ క్రాస్ బలోపేతం మరియు బ్లడ్ సెంటర్ల కార్యక్రమాల గురించి చర్చించి వేసవికాలం దృష్ట్యా బ్లడ్ సెంటర్లలో రక్తం కొరత లేకుండా చూడాలి, అదేవిదంగా ప్రకృతి వైపరీత్యాల పై అలెర్ట్ గా ఉండాలని సూచించారు. తెలంగాణ రెడ్ క్రాస్ సొసైటీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశంలో మొదటి స్థానంలో ఉండే విదంగా తన వంతుగా సహాయ సహకారాలు అందచేస్తాని తెలిపారు. గవర్నర్ కలిసిన వారిలో హనుమకొండ జిల్లా చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఇ. వి. శ్రీనివాస్ రావు, కె. ప్రసాద్ రావు, మహేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి , రమేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నటరాజ్, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ ను సన్మానించిన వెలుమ సంఘం



**పరకాల, మార్చి 30, (ప్రజా జ్యోతి):** ఆల్ ఇండియా పద్మ నాయక వెలుమ అసోసియేషన్ పరకాల వారి ఆధ్వర్యంలో 14వ వార్డులో గెలిచిన పడిదెల దీప్తి రాకేష్ రావు లను ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలుమ సామాజిక వర్గం నుంచి దీప్తి గెలవడం సంతోషకరమని, రాబోయే రోజుల్లో ఇంకా పెద్ద ఎత్తున అవకాశాలు రావాలని కోరుతున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వెలుమ సంఘం నాయకులు దగ్గు విజేందర్ రావు, కొలుగూరి రాజేశ్వర్ రావు, దగ్గు తిరుపతిరావు, భాస్కర్ రావు, శ్యాం రావు, బాబురావు, శ్రీనివాసరావు, కాంతారావు, సాయి చరణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు.. బిఆర్ఎస్‌లో సస్పెన్షన్ కలకలం..!

**పర్వతగిరి, మార్చి 30 (ప్రజాజ్యోతి)** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదేశాల మేరకు పర్వతగిరి మండలంలో బిఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. మాజీ జెడ్పీటీసీ సభ్యులు మేడిశెట్టి రాములను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు వెల్లడించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలు చేపట్టడం వల్ల సస్పెన్షన్ అనివార్యమైందని పేర్కొన్నారు. ఈ పరిణామం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. బిఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు బయటపడుతున్నాయా? లేక క్రమశిక్షణ చర్యల భాగమా? అనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఇకపై పార్టీ శ్రేణులు క్రమశిక్షణ పాటిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకత్వం పిలుపు నిచ్చింది.

# బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు

- బాలల పరిరక్షణకు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక డ్రైవ్



ఏటూర్ నాగారం మార్చి 30 ప్రజా జ్యోతి

బాల కార్మికులను పని లో పెట్టుకుంటే చర్యలు తప్పవునీ సిడి పి ఓ ప్రేమలత అన్నారు. సోమ వారం బాలల పరిరక్షణకు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక డ్రైవ్నిర్వహించడం జరిగింది అన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో బాలల పరిరక్షణకు విస్తృత కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ , చైల్డ్ హెల్ప్ లైన్ ఉమెన్ హబ్ సంయుక్తంగా బాలల సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.ఈ సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. బాలలను పనుల్లో పెట్టుకునే వ్యాపార సంస్థలు, యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా షాపులు, హోటళ్లు, ఇటుక భట్టీలు, పరిశ్రమల వంటి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ బాల కార్మికులను గుర్తిస్తున్నారు.

ఈ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటివరకు సుమారు 100 మంది బాలలను రక్షించి, వారికి విద్య, ఆరోగ్య మరియు పునరావాస సేవలు అందిస్తున్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్ట విరుద్ధమని, 14 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలలను ప్రమాదకర పనుల్లో నియమించడం నిషేధమని అధికారులు స్పష్టం చేశారు.బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు ప్రజల్లో ప్రచారం నిర్వహిస్తూ, తల్లిదండ్రులకు మరియు వ్యాపార వర్గాలకు సూచనలు ఇస్తున్నారు. పిల్లలను పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తును కాపాడాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు కొనసాగుతుండగా, బాలల భద్రత మరియు సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు.

## బాధలో ఉన్న కుటుంబానికి అండగా కాంగ్రెస్ నాయకులు



**ఏటూర్ నాగారం మార్చి 30 ప్రజా జ్యోతి** ఏటూర్ నాగారం మండలంలోని శంకరాజుపల్లిలో సోమ వారం దశదిన కర్మలో కాంగ్రెస్ నేతల పరామర్శ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారూ.మంత్రివర్యులు ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశాల మేరకు, ములుగు డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్, రాష్ట్ర యువజన కార్యదర్శి కుంజా సూర్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న సూచనలతో మండల కాంగ్రెస్ నాయకులు చిటమట రఘు ఆధ్వర్యంలో శంకరాజుపల్లి గ్రామంలో దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యారు.గ్రామానికి చెందిన లెంకల చంద్రయ్య ఇటీవల మరణించగా, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.మండల కాంగ్రెస్ నాయకుల సహకారంతో మృతుడి కుటుంబానికి 50 కేజీల బియ్యం మరియు రూ.3,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కష్టకాలంలో కుటుంబాలకు అండగా నిలవడం పార్టీ బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్, సర్పంచ్ గద్దల నవీన్, కావిరి అర్జున్, గ్రామ కమిటీ అధ్యక్షులు కావిరి మొండయ్య, జాడి సత్యనారాయణ, తాటి నీలాద్రి, కొండగొర్ల నర్సింహులు, కొండగొర్ల రాజేష్, సోదారి కుమార్, సప్పిడి రాంబాబు, అల్లంల చంటి, పొలం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు నోటీసు లేకుండానే సర్వే..

- కొత్తగూడెంలో నిబంధనలకు విరుద్ధంగా భూమి కొలతలు..!
- దౌర్జన్యంగా పట్టా భూమిలో సర్వే నిర్వహించిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలి
- అధికారులను వేడుకున్న బాధితుడు



**సంగెం,మార్చి30(ప్రజాజ్యోతి):** వరంగల్ జిల్లా సంగెం మండలం కొత్తగూడెం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా పట్టా భూమిలో అక్రమ సర్వే నిర్వహించడం కలకలం రేపింది.గ్రామానికి చెందిన బాధితుడు బొంత బిక్షపతి తండ్రి.కొమురయ్య తన స్వంత పట్టా సర్వే నెంబర్ (309/B) 0.10 గుంటల భూమి గవిచర్ల శివారులో కలదు.తనకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా,తన అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ప్రవేశించి మండల సర్వేయర్ కాని వ్యక్తి తో సర్వే నిర్వహించారని ఆరోపించారు.ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో బాధితుడు బొంత బిక్షపతి మాట్లాడు తూ. .నా స్వంత పట్టా భూమిలో నాకు తెలియకుండా సర్వే చేయడం చట్టవిరుద్ధమని భూమికి సంబంధించిన అన్ని రికార్డులు (పట్టాదారు పాస్ బుక్, పహాణీ) నా పేరిట స్పష్టంగా ఉన్నప్పటికీ, కొందరు కావాలనే నా హక్కులకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారని,ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టా భూమిలో సర్వే చేయాలంటే యజమానికి నోటీసు ఇవ్వాలి,కానీ ఇక్కడ అవేవీ పాటించకుండా దొంగచాటుగా సర్వే నిర్వహించారని అన్నారు.ఈ అక్రమ సర్వేపై ఇప్పటికే అధికారులకు రాతపూర్వక ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.అధికారులు తక్షణమే స్పందించి,నా భూమిలోకి అక్రమంగా ప్రవేశించిన వారి పై వారికి సహకరించిన వారి పై కఠిన చర్యలు తీసుకోని న్యాయం చేయాలని కోరారు.ఇలాంటి అక్రమ చర్యల వల్ల గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని,అధికారులు వెంటనే విచారణ జరపాలని వేడుకున్నారు

## కీర్తిశేషులు భాస్కర్ జ్ఞాపకార్థం విద్యార్థులకు సేవా విరాళం

- కొంకపాకలో గ్రానైట్, డైనింగ్ టేబుల్స్, మినీ మినరల్ వాటర్ ప్లాంట్ అందజేత





**పర్వతగిరి, మార్చి 30 (ప్రజాజ్యోతి )** పిల్లలమర్రి రాజయ్య సంధ్యారాణి దంపతుల ఏకైక పుత్రుడు, కీర్తిశేషులు పిల్లలమర్రి భాస్కర్ జ్ఞాపకార్థం కొంకపాక గ్రామంలో ఆదర్శప్రాయమైన సేవా కార్యక్రమం నిర్వహించారు. తమ కుమారుని స్మృతిలో విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొంకపాకలో భోజనశాలకు గ్రానైట్ డైనింగ్ టేబుల్స్, బెంచీలు, ప్రాథమిక పాఠశాలలో మినీ మినరల్ వాటర్ ప్లాంట్‌ను దాతృత్వంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, అందజేసిన సదుపాయాలను ప్రారంభించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి అల్లం దాస్ బిక్షపతి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా కొంకపాక గ్రామ సర్పంచ్ రాయబారపు రమాదేవి వివేక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అల్లం దాస్ బిక్షపతి మాట్లాడుతూ పిన్న వయసులో భాస్కర్ మరణం చాలా దురదృష్టకరం. అయినప్పటికీ, తన కుమారుని జ్ఞాపకార్థం దాదాపు లక్ష రూపాయలతో విద్యార్థుల కోసం సదుపాయాలు కల్పించడం ఎంతో ప్రశంసనీయం. ఈ కుటుంబం చూపిన సేవా భావం సమాజానికి ఆదర్శం అని కొనియాడారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. స్థానిక సర్పంచ్ రాయబారపు రమాదేవి వివేక్ మాట్లాడుతూ తమ కుమారుని కోల్పోయిన దుఃఖాన్ని దిగమింగుకొని, ఆయన చదివిన పాఠశాలలో విద్యార్థుల కోసం ఈ సహాయం చేయడం అభినందనీయం. విద్యార్థుల ముఖాల్లో తమ కుమారుని చూసుకుంటూ ధైర్యంగా ముందుకు సాగాలి అని అన్నారు. గ్రామ ప్రజల తరపున కుటుంబానికి సానుభూతి, కృతజ్ఞతలు తెలియజేశారు. భాస్కర్ తల్లిదండ్రులు భావోద్వేగంతో మాట్లాడుతూ మాకు ఎదురైన దుస్థితి మరే తల్లిదండ్రులకు రావద్దు. మా కుమారుని పేరిట అందజేసిన ఈ సదుపాయాలను విద్యార్థులు జాగ్రత్తగా ఉపయోగించి, అతని ఆత్మకు శాంతి చేకూరేలా చేయాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, గ్రామ వార్డు సభ్యులు, ఉప సర్పంచ్, మాజీ ఎంపీటీసీలు, ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బీసీల భారీ నిరసన

- ప్లకార్డులతో గళమెత్తిన నేతలు



**సంగెం,మార్చి30(ప్రజాజ్యోతి ):** దేశ రాజధానిలోని తెలంగాణ భవన్ సాక్షిగా బీసీల సమస్యల పరిష్కారం కోసం భారీ నిరసన కార్యక్రమం బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగింది.పెండింగ్‌లో ఉన్న బీసీల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భారత్ బృందం మేధావులు ప్లకార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల పట్ల పాలకులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు.ప్లకార్డులపై తమ డిమాండ్లను ప్రదర్శిస్తూ,తెలంగాణ భవన్ ఆవరణలో నినాదాలతో హోరెత్తించారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ స్థాయిలో బీసీ కులగణన చేపట్టాలని,పార్లమెంట్ మరియు అసెంబ్లీలలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రంలో బీసీల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని,విద్య,ఉపాధి రంగాల్లో బీసీలకు కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు,వారి అభివృద్ధిని విస్మరించడం సరికాదని నేతలు హెచ్చరించారు.తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆపేది లేదని,అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,బిదా మస్తాన్ రావు,విజయనగరం ఎం.పి.అప్పలనాయుడు,మాజీ రాజ్యసభ సభ్యులు హన్మంతరావు ఆర్. కృష్ణయ్య కుమారుడు అరుణ్,తెలంగాణ బిసి ప్రజాసంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయిని భరత్ వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం సాంబయ్య,రాష్ట్ర కార్యదర్శి వాసం సురేష్,రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడికందుల వీరేశం,వరంగల్ బిసి నాయకులు పాల రంజిత్,గొంగళ్ళ సాంబయ్య,కేదారి,బిసి నాయకులు పాల్గొన్నారు.

## నేడు రాయపర్తి రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**రాయపర్తి మార్చి 31 ప్రజా జ్యోతి** నేడు రాయపర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 9 గంటలకు పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని స్థానిక రెవెన్యూ అధికారి (ఆర్ .ఐ )చంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.

# డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నూతన మండల కమిటీ ఎన్నిక

**వరంగల్ సిటీ, మార్చి 30(ప్రజాజ్యోతి):** డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, గీసుగొండ మండల శాఖ సర్వ సభ్య సమావేశం నగరంలోని ధర్మారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. ఇందులో భాగంగానే విద్య వ్యవస్థ పనితీరును, నూతన విద్యా సంస్కరణలపై చర్చించారు. ఉపాధ్యాయ వృత్తిపర సమస్యలతోపాటు, సామాజిక భార్యతలను నేరవేర్చ లని పరశీలకులుగా విచ్చేసిన టి అనందచారి తెలి పారు. రాష్ట్రంలో విద్య కమిషన్ రిపోర్టు, ఆకునూరి మురళి ప్రతిపాదించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం వల్ల ప్రభుత్వ పాఠశాలలు తీవ్రంగా నష్టపో తాయని సంఘ సభ్యులు పేర్కొన్నారు. నూతన కమిటీ ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన టి ఆనంద చారి నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమా ణం చేయించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వా నికి పలు డిమాండ్లను ప్రకటించారు. అందులో పెండింగ్ లో ఉన్న 5 డీఏ వెంటనే విడుదల చేయాలి. తెలంగాణలో రెండవ పిఆర్సి అమలు చేయాలి. సిపి



ఎస్ నూ రద్దుచేసి ఓపీఎస్ ను పునరుద్ధరించాలి. ఆకు నూరి మురళి విద్యా కమిషన్ ప్రతిపాదించిన తెలం గాణ పబ్లిక్ స్కూల్ విధానాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపె ట్టాలి. ఉద్యోగ విరమణ పొందిన ప్రభుత్వ ఉపా ధ్యాయు ల బెనిఫిట్స్ ను వెంటనే చెల్లించాలి. బడ్జెట్లో విద్యా శాఖకు 20 శాతం నిధులు కేటాయించాలి. పశ్చి మాసియాలో జరుగుతున్న అనవసరమైన యు ద్ధాలను వెంటనే ఇరుదేశాలు ఆపాలి. ఉద్యోగుల పెం డింగ్ ఇల్లుల కోసం ప్రతినెలా కేటాయిస్తున్న 700 కోట్లను, 1500 కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు.

**నూతన కమిటీ వివరాలు..** డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరే షన్ (డిటిఎఫ్) గీసుకొండ మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా కే రమేష్ బాబు, ఉపాధ్యక్షులుగా డా.అశోక్, ఎన్ మాధవి, ప్రధానకార్యదర్శిగా పీ రజినీ కాంత్, కార్యదర్శులు గా వి మల్లయ్య, టి రామకృష్ణ, బి మాధవి, జిల్లా కౌన్సిలర్స్ గా టి సూరయ్య, ఎస్ సుధారాణి, ఎస్ దిలీప్ కుమార్, ఎన్ సత్యనారాయణ, ఆడిట్ కమిటీ సభ్యులుగా జి సాంబయ్య, కే లక్ష్మయ్య, ప్రతిపాదకులు కే చంద్రమౌళి, ఎన్ మల్లయ్య బలపర చనైనది. ఎన్నికల పరిశీలకులుగా టీ ఆనందచారి (జిల్లా కార్యదర్శి) వ్యవహరించారు.

## సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- •సి. ఐ మల్లేష్
- •సి. ఐ ని కలిసిన మొగుళ్ళ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు




**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (మార్చి 30)** నేటి సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలక మని చిట్యాల సి. ఐ. మల్లేష్ అన్నారు. ఇటీవలే నూతనంగా ఎన్నికైన మొగుళ్ళ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం చిట్యాల సి. ఐ. ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సి. ఐ. మాట్లాడారు.సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమా లను కలమనే ఆయుధంతో వెలికి తీయాలని కోరారు.వార్తలను నిష్పాక్షపాతంగా నిర్భయంగా వ్రాసి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలాన్నారు.ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచేది జర్నలిస్టులేనని అలాంటి జర్నలిస్టులు సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మల సారయ్య, ప్రధానకార్యదర్శి కట్కూరి ఐలయ్య, ఉపా ధ్యాక్షులు గుండారాపు రమేష్, ఉప్పుల రవికిరణ్,సహాయ కార్యదర్శులు వేముల నవీన్, రాళ్ళబండి శ్రీనివాస్,ప్రచార కార్యదర్శి క్యాతరాజు రజనీకాంత్,ముఖ్య సల హాదారు పెద్దోజు దేవేందర్,సంయుక్త కార్యదర్శి చెక్క శ్రీధర్ర్,కార్యవర్గ సభ్యులు బండారి మహేష్,మంగళ పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**నల్లబెల్లి, మార్చి 30, (ప్రజా జ్యోతి):** మండ లంలోని అర్షనపల్లి ధ ర్మారావుప ల్లి గ్రామాల్లో అభివృద్ధి పనులకు వేగంగా అడు గులు పడుతున్నాయి. నర్సంపేట శాసనస భ్యులు దొంతి మాధవ రెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరైన నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఘనంగా ప్రారంభించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకా రంతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ప్రజల మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వైనాల అశోక్, ఇఫ్తార్ శేఖర్ గౌడ్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చరణ్ సింగ్.ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బౌసింగ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కుసుంబ రఘుపతి.సర్పంచులు సిద్ధ సంతోష్, ముస్కు పోషలు, పొదిల వసంత శోభన్. మండల కార్యదర్శి జెట్టి రామ్మూర్తి, ఇంద్ర రెడ్డి, డాగాల కృష్ణ, విఎఫ్ జి అధ్యక్షుడు శ్రీనివాస్, మనోహర్, పోగుల కుమారస్వామి, దూలపల్లి రవీందర్రావు, తిప్పని లింగమూర్తి.రంగాపురం గ్రామాధ్యక్షులు రమేష్, రాకేష్, శ్రీను, రాజయ్య, రవి, రాజు, కుమారస్వామి, శివకు మార్, రవీందర్, సారయ్య, రాజ పోశాలు, రాము, మల్లయ్య తదితర కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

- అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు



**ఖానాపురం /మార్చి 30(ప్రజా జ్యోతి )** ఖానాపురం మండల కేంద్రంలో సోమ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి సర్పంచ్ దాసరి రమేష్ భూమి పూజ చేశారు. విగ్రహ ప్రతిష్టాపన నిర్మాణ కార్యక్రమం లో అతిథులు ఎస్సై రఘుపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, మాజీ జెడ్పిటిసి ఎడ్ల జగన్మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ ఉప్పు రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఖానాపూర్ మండల కేంద్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. అంబేద్కర్ సాధించిన ఆశయ ఫలాలే నేడు ఎస్సీ,ఎస్టి, బిసి అనగారిన వర్గాలకు రాజ్యాధికారం దక్కిందని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయ సాధ నలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ బాధ్యులు ముడుసు రమేష్, మర్రి శివరాజ్, రెంటాల రాజు, మర్రి రామస్వామి, మర్రి వంశీ, వల్లెపు శ్రీనివాస్, వార్డు సభ్యులు పల్నాటి నిర్మల, కందుల రమ, కామిశెట్టి లక్ష్మి శాఖమూరి ముఖేష్, గుండ్లపల్లి విజయ్, వేములపల్లి వెంకట ప్రసాద్ రావు, చలికంటి మల్లికార్జున్, భూక్య స్రవంతి, ఈలపొంగు కొమరమ్మ, తోటకూరి సంధ్య, ఎండి ఆజహార్, గుండ్లపల్లి మంజుల, కాంగ్రెస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## రజకుల వైకుంఠధామంలో శివుని విగ్రహ ప్రతిష్టాపన



**వరంగల్ సిటీ, మార్చి 30(ప్రజాజ్యోతి):** వరంగల్ నగరంలోని రంగశాయి పేట శివారు బెస్తం చెరువు వద్దగల రజక వైకుంఠధామంలో సోమవారం శివుని విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. దాతలు నల్లతీగల రవి మరియు వెంకన్న సహకారంతో ఇట్టి ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. రజకుల సంఘం సభ్యులు, ప్రముఖులు, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శివుడు స్మశానంలో నివసించే దేవుడు (స్మశాన వాసి)గా భావిస్తారు. జీవితం–మరణం మధ్య సత్యాన్ని ఆయన ప్రతిబింబిస్తాడు. అందుకే దాతల సహకారంతో స్మశానంలో ఆయన విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విగ్రహదాతలు నల్లతీగల రవి, నల్లతీగల వెంకన్న, 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, న్యాయవాది, సామాజికవేత్త శేర్ల అనిల్ కుమార్, ఆర్ వై ఎఫ్ సభ్యులు, మునుకుంట్ల పెద్ద రాములు,చిన్న రాములు, చేరాలు, ఐలయ్య హరీష్, విక్రమ్, విజయానంద్, మునుకుంట్ల మల్లేశం, ఆగయ్య, కత్తెరపల్లి వేణు, ప్రవీణ్ మరియు రజక కుల సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శేష వాహనంపై ఘనంగా శ్రీ సీతారాముల ఊరేగింపు

- హోమాలు, బలిహరణ పూజలతో ఆలయం ఆధ్యాత్మిక శోభా సంతరించుకుంది
- భక్తి పారవశ్యంలో కొనసాగుతున్న శ్రీరామనవమి వేడుకలు



**వరంగల్ సిటీ, మార్చి 30(ప్రజా జ్యోతి):** నగరంలోని రంగశాయిపేట ప్రాచీన శ్రీ సీతారామచంద్రస్వామి దేవ స్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం హోమాలు, బలిహరణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ యాగాలు ఆలయ పరిసరాలను ఆధ్యాత్మిక వాతావరణంతో నింపాయి. అనంతరం సాయంత్రం స్వామివారు శేష వాహనంపై రంగశాయిపేట పురవీధులలో తిరు గుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో



మంగళ హారతులు కట్న కానుకలు సమర్పించి, "జై శ్రీరామ్" అంటూ నినాదా లతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. శేష వాహనంపై స్వామివారి విహారం సృష్టి స్థితి లయలకు సంకేతంగా భావిస్తారు. పురోహితులు, భజన మండలి సభ్యులు రామనామ సంకీర్తనలు చేస్తూ ఉత్సవాలకు మరింత ఉత్సా హాన్ని తీసుకువచ్చారు. కార్యక్రమంలో దేవాలయ స్థలదాతలు వద్దిరాజు శ్యాంసుందరరావు, ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ పులిగిల్ల వెంకటరామ నరసింహ శాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల శ్రీధర్ ఆచార్యులు, 42వ డివిజన్ కార్పొరే టర్ గుండు చందన పూర్ణచందర్, 41 డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ స్వామి, ఆలయ ట్రస్ట్ చైర్మన్ పులిగిల్ల వెంకట రామ నరసింహ శాస్త్రి ఆలయ ధర్మకర్తలు ఆవునూరి కుమారస్వామి, వద్దిరాజు శ్రీనివాసరావు, విలాసాగరం శ్రీనువాసు(చిన్న), సోమ అనిల్, బొల్లెపల్లి సరిత, బోలుగొద్దు అనిల్, పాలకుర్తి సుమన్, వడ్డే శిరీష్, కురుమ కరసేవకులు, వడ్ల, కమ్మరి, మంగలి సేవకులు, శ్రీరామ భజన మండలి సభ్యులు, మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ప్రత్యేక వైద్య శిబిరం



**మల్హార్, మార్చి 30 ప్రజా జ్యోతి** భూపాలపల్లి జిల్లా మల్హార్ రావు మండల కేంద్రమైన తాడిచెర్ల లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో బాగంగా జిల్లా వైద్య ఆరోగ్య ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం వైద్యధికారి వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ వైద్యాధికారులతో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధులతో బాధపడు తున్న 164 మంది రోగులకు ప్రత్యేక పరిక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ వినయ్ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యాధికారులతో పాటు ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్ ఉచిత కంటి వైద్య శిబిరం

- ఏసీపీ అంబాటి నర్సయ్య




**పాలకుర్తి మార్చి 30/ ప్రజా జ్యోతి /** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధి లో వివిధ వాహన డ్రైవర్లకు అరైవ్ అలైవ్ ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం వర్ధన్నపేట ఏసీపీ అంబాటి నరసయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించడం జరిగినది. అనంతరం ఏసీబీ నరసయ్య మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. తమ కుటుంబ పోషణ కొరకు డ్రైవింగ్ నే వృత్తినే నమ్ముకొని వృత్తి రీత్యా బయటికి వెళ్లే ముందు ప్రయాణికులను క్షేమంగా వారి గమ్యానికి చేర్పించి వారు క్షేమంగా ఇంటికి చేరుకోవాలని కోరారు.వారి కోశం ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి ఐ వట్టే జానకిరామ్ రెడ్డి, ఎస్ ఐ దూలం పవన్ కుమార్, కొడకండ్ల ఎస్ఐ సిహెచ్ రాజు, దేవరుప్పుల ఎస్సై ఊరా సృజన్ కుమార్, మూడు మండలాలకు చెందిన బస్సు, ఆటో, ట్రక్కు, ట్రాక్టర్ లకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

# జయముఖి కళాశాల సమీపంలో ఘోర ప్రమాదం

- డీసీఎం ఢీకొని సైక్లిస్ట్ మృతి.



**చెన్నారావుపేట మార్చి 30 (ప్రజా జ్యోతి)** నర్సంపేట – నెక్కొండ ప్రధాన రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జయముఖి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో వేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ ఒక సైకిలిస్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. నెక్కొండ వైపు నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ జయముఖి కళాశాల వద్దకు రాగానే అదుపుతప్పి ఎదురుగా వస్తున్న సైకిలిస్టును ఢీకొట్టింది. డీసీఎం వేగం ఎక్కువగా ఉండటంతో సైకిల్‌పై ఉన్న వ్యక్తి గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలు అయ్యి రక్తస్రావం ఎక్కువగా జరగడంతో బాధితుడు ఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించకపోవడంతో వివరాలు సేకరించే పనిలో పడ్డారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# అలైవ్ అరైవ్ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి పరీక్షలు




**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 29 (ప్రజా జ్యోతి) :** అలైవ్ అరైవ్ కార్యక్రమాన్ని జనగామ జిల్లా పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని విజయలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్సు, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లకు పాత్రికేయులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను, మందులను శ్రీ సరోజిని కంటి హాస్పిటల్ జనగామ వారిచే అందజేశారు. ఈ సందర్భంగా డిసిపి రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ రోడ్డు భద్రత కార్యక్రమాలను జనవరి నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన ఈ కార్యక్రమం రాష్ట్ర డిజిపి, కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతి నెల చివరి వారంలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహిస్తున్నామని, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 25 నుండి 31 వరకు ఈ కార్యక్రమంలో దాతల సహాయం తో ఉచిత హెల్మెట్ల పంపిణీ, లైసెన్సు లేని వారికి లైసెన్స్ ఇప్పించటం, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కల్పించడం, వాహనం నడిపే వారికి కంటిచూపు సమస్య లేకుండా ఉచిత కంటి పరీక్ష నిర్వహించి అద్దాలు అందజేస్తునట్లు తెలిపారు. జనగామ జిల్లాను యాక్సిడెంట్ ఫ్రీ జిల్లాగా చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎసిపి పండరీచేతన్, సిఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్సైలు, కంటి డాక్టర్ సిహెచ్. సృజన్ కుమార్, పోలీసు సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వన మాల కుంటను బతుకమ్మ కుంట గా, మినీ స్టేడియంగా చేసుకుందాం

- గ్రామ సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్



**కొడకండ్ల, మార్చి 29 (ప్రజాజ్యోతి ) :** మండల కేంద్రంలోని వనమాల కుంటను బతుకమ్మ కుంటగా, మినీ స్టేడియంగా అభివృద్ధి చేసుకుందామని కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎంతో వైభవోపేతంగా బతుకమ్మ వేడుకలు జరుపుకునేందుకు గాను, మినీ స్టేడియంగా అభివృద్ధి చేసుకోవడం కోసం గ్రామ సభ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు వివరించారు. గ్రామంలో ప్రధాన సమస్యగా ఉన్న వీధి కుక్కలు, కోతులను పట్టించేందుకు గ్రామ ప్రజలు విరాళాలు ఇవ్వాలని కోరారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని భావిస్తున్నట్లు అన్నారు. అలాగే పారిశుధ్య పనులు, డ్రైనేజీ సమస్యలు, తాగునీరు , గ్రామంలో సులబ్ కాంప్లెక్ ఏర్పాటు, అంగడిలో కనీస వసతులు, అదనపు కరెంట్ పోల్స్, ఇతర పనులను గ్రామ సభ దృష్టికి తెచ్చిన అంశాలను ప్రత్యేక దృష్టిలో ఉంచుకొని స్థానికి ఎమ్మెల్యే సహకారంతో, జిపి నిధుల ద్వారా చేస్తున్నామని అన్నారు.

# సీసీ రోడ్లను సద్వినియోగం చేసుకోవాలి

- మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పేట రమేష్.
- లింగాపురంలో ఘనంగా ప్రారంభమైన రోడ్డు పనులు.



**చెన్నారావుపేటమార్చి 30(ప్రజా జ్యోతి )** లింగాపురం గ్రామ ప్రజలు ప్రభుత్వం నిర్మిస్తున్న సీసీ రోడ్లను సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ తప్పేట రమేష్ కోరారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో గ్రామంలో మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనే ధ్యేయంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. సోమవారం గ్రామంలో జరిగిన రోడ్డు నిర్మాణ పనుల పరిశీలనలో ఆయన మాట్లాడుతూ.. పల్లెల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి చొరవతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి నిధులు మంజూరు అవుతున్నాయని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన రోడ్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పురం అనిత రాంబాబు,కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మచ్చిక కుమారస్వామిగౌడ్,మాజీ సర్పంచ్ మందాటి కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ అజ్మీర నంద్యా నాయక్,వార్డు సభ్యులు గుగులోతు భద్రు, ముదిగొండ బాబు, తాళ్లపెల్లి రేణుక స్వామి, రాజులపాటి ఉమ, తొర్రి రాజ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎలుగోయా శ్రీలత, ముదిగొండ అనిత, పంచాయతీ కార్యదర్శి అనిత,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పల్లాటి రమేష్,వెంగళదాసు రామ్మూర్తి, ముదిగొండ చంద్రమౌళి, తలబోయిన రాజు, భూషణబోయిన ఐలయ్య, ముత్యాల శ్రీనివాస్, రెడ్డబోయిన రాజు, మామిండ్ల రాజు, బొంత రాజు, గొట్టే ఐలయ్య, తప్పేట సూరయ్య, దుర్గయ్య, స్వామి, మూగల రాకేష్, నరిగే శ్రీను, ఆరెల్లి కుమారస్వామి, రాజులపాటి కృష్ణ, రామగిరి లక్ష్మణ్, తప్పేట అఖిల్ ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ ఈసీ మెంబర్ గా రాగల శ్రీహరి



**లింగాల గణపురం , మార్చ్ 30 (ప్రజాజ్యోతి)** మండల కేంద్రానికి చెందిన అడ్వకేట్ రాగల్ల శ్రీహరి జిల్లా బార్ అసోసియేషన్ ఈసీమెంబర్ గా ఎన్నిక ఈ సందర్భంగా అడ్వకేట్ శ్రీహరి మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన బార్ అసోసియేషన్ మెంబర్స్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇచ్చిన హామీలను అడుగుతే అరెస్ట్ ల

- తడక అశోక్ గౌడ్ ఉద్యమకారుడు బిజెపి జిల్లా కార్యదర్శి




**నల్లబెల్లి మార్చి 30 (ప్రజా జ్యోతి ):** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆనాటి పది జిల్లాలలోని ఉద్యమకారులు నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుట కొరకు ఉద్యమం ఎక్కడ సడలకుండ పోరాటం చేసి స్వరాష్ట్రం సిద్ధించేదాక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటు పోలీసు కేసులు,లాటీలు తూటాల ను సైతం తట్టుకుంటూ కుటుంబాలను చిన్న భిన్నం చేసుకున్న తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఆరోవ గ్యారెంటీ కింద ఉద్యమకారులకు పింఛన్ సౌకర్యం ఏర్పాటు చేస్తానని నమ్మబలికి నాడు. ఓట్లు దండుకొని నేడు పోలీసు అరెస్టులు చేయడం సిగ్గుమాలిన చర్య అని తెలంగాణ ఉద్యమకారుడు బిజెపి పార్టీ జిల్లా కార్యదర్శి తడక అశోక్ గౌడ్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్ రెడ్డి గారు ఏకే 47 రైఫిల్ పెట్టుకొని ఉద్యమకారులను అణచివేసే ప్రయత్నం చేసినాడు. అని అలాంటి రేవంత్ రెడ్డి గారు దొడ్డిదారిన గెలవడం కొరకు ఉద్యమకారులను పావులుగా వాడుకొని గద్దెనెక్కినాడని విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అరెస్టులు కాకుండా ఉద్యమకారుల కోసం తగిన గుర్తింపుని ఇవ్వాలని లేనిచో ప్రభుత్వాన్ని ఉద్యమకారులు బొంద పెట్టే సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. అసలే తెలంగాణ ఉద్యమంలో నిరంత నిరంతర పోరాటాలు చేసి రోగాల బారినపడి కుటుంబాలను వెళ్ళదీయలేక కాలం వెళ్లదీస్తున్న తెలంగాణ ఉద్యమకారులను నక్సలైట్ల వలె అరెస్టు చేయడం తగదన్నారు. ఉద్యమకారులు దేశద్రోహులు కారని ఇచ్చిన హామీలనే ప్రశ్నిస్తున్నందుకు ఇలా చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రజాస్వామ్యవాదులు ప్రజలు ఉద్యమకారుల పక్షాన నిలిచి ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు

# డ్రైవర్ల ఆరోగ్యం.. ప్రజల భద్రతకు బాట..

- డ్రైవర్ల భద్రత కోసం పోలీసుల ఉచిత కంటి వైద్య శిబిరం





**పర్వతగిరి, మార్చి 30 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి సర్కిల్ పరిధిలో పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో ఐనవోలు, సంగెం, పర్వతగిరి పోలీస్ స్టేషన్ల పరిధికి చెందిన హెవీ, ట్రాన్స్‌పోర్ట్ వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ మాట్లాడుతూ, డ్రైవర్లకు స్పష్టమైన చూపు ఉండటం అత్యంత కీలకమని, కంటి చూపు మెరుగ్గా ఉంటేనే సురక్షితంగా వాహనం నడపగలరని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే ఆరోగ్యపరమైన జాగ్రత్తలు కూడా అంతే ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ప్రవీణ్, శ్రీనివాస్, వంశీకృష్ణ పాల్గొని డ్రైవర్లకు రోడ్ సేఫ్టీ, సేఫ్ డ్రైవింగ్ పై అవగాహన కల్పించారు.

# ఏ కార్యకర్తకు కష్టమచ్చినా అండగా ఉంటా

- సురేందర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**మహాముత్తారం,మార్చి 30. ప్రజాజ్యోతి.** అధికారం. పదవులు ఉన్నా లేకున్నా ఏ కార్యకర్తకు కష్టమచ్చినా అండగా ఉంటానని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మహాముత్తారం మండలం నర్సింగపూర్ గ్రామా నికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు,బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గ్రామ వార్డు మెంబర్ తిప్పనపల్లి సురేందర్ ఆకస్మికమృతి చెందగా సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సురేందర్ మరణం అందరిని శోకసంద్రం, బాధలోకి నెట్టేసిందన్నారు. వచ్చేసారి పార్టీ గెలువాలని భవిష్యత్ బాగుంటదని గొప్పగా ఆలోచన చేశాడని, పార్టీ నాయకత్వం కుటుంబం మీద ఆశలు పెట్టుకున్న వ్యక్తి ఈనాడు మనతో లేకపోవడం బాధాకరంగా ఉందన్నారు. సురేందర్ ఆశయాలను కొనసాగించడమే ముఖ్యమని ఆయన అన్నారు. మంథని చరిత్రలో తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఈ ప్రాంతంలో ప్రజలతో ఎన్నుకోబడిన అలాగే ఓడిపోయినా ప్రజలకు అందుబాటులో ఉండే కార్యక్రమాలను సమాజానికి చూపిస్తున్నానన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అనేక విషయాలు సమాజానికి తెలిసేలా చేశానని, అయినా ఇప్పటికి కొందరికి తనను అర్థం చేసుకోకపోవడం బాధాకరమన్నారు. ఈనాటి ఎమ్మెల్యే ఆనాటి నుంచి చేయని కార్యక్రమాలు చేశామని గుర్తు చేశారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అండగా నిలుస్తున్నామని, మనలోని ఒక సైనికుడు చనిపోయాడంటే వారి బార్య పిల్లలను చూస్తుంటే గుండె బరువెక్కుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సురేందర్ చనిపోయిన తర్వాత డబ్బు సేకరణ చేయడం బాధకల్గించిందని, అయితే ఆ కుటుంబానికి అండగా నిలువాలనే ఆలోచన ఎంతో గొప్పదన్నారు. సురేందర్ ఆశయాలను నెరవేర్చడానకి బీఆర్ఎస్ పార్టీ తో పాటు తాను వందకు వందశాతం అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పిల్లల చదువు, పెండ్లి కోసం తనవంతు సహాకారం ఉంటుందన్నారు. పెద్ద దిక్కు కోల్పోయిన ఆ కుటుంబానికి బాధ రాకుండా చూడాల్సిన బాధ్యత ఉందని, అందరం ఒక కుటుంబంలా బావించి ముందుకు నడువాల్సిన అవసరం ఉందన్నారు. అధైర్యపడవద్దని ఏ కష్టమున్న అండగా ఉంటామని సురేందర్ కుటుంబానికి ఈసందర్భంగా ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జక్కు రాకేష్ మండల నాయకులు మార్కా రాము అనిల్ రెడ్డి జైపాల్ నాయక్ లక్కిరెడ్డి ప్రశాంత్ రెడ్డి రాధారపు స్వామి శ్రీపతి సురేష్ బోడ బాలాజీ తదితరులు ఉన్నారు.

# విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించేందుకు సర్వే



**వాజేడు, మార్చి 30, (ప్రజాజ్యోతి):** మూడవ తరగతి విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించేందుకు రాష్ట్రంలోని 407 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో ఈనెల 30, 31వ తేదీలలో ఫౌండేషన్ లెర్నింగ్ స్టడీ (ఎఫ్ఎల్ఎస్) పేరిట కేంద్ర ప్రభుత్వం సర్వే నిర్వహించనుంది. ఈ సర్వేలో భాగంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ లు డిఈడీ విద్యార్థులైన అంజలి, వైష్ణవిలు ములుగు జిల్లా వాజేడు మండలంలోని జగన్నాధపురం గ్రామంలో గల ఎంపీయుపిఎస్, చెరుకూరు గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలల్లోని మూడవ తరగతి విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలను ములుగు జిల్లా ఉల్లాస్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణ బాబు, ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సోమవారం పరీక్షించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సెల్ ప్రారంభోత్సవం

- రూ.50 వేల విలువైన పుస్తకాలను అందజేసిన సుశ్రుత ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ మాలోతు రవీందర్ చౌకీదార్.




**నర్సంపేట మార్చి 30 (ప్రజా జ్యోతి )** నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో విద్యార్థుల భవిష్యత్ పోటీ పరీక్షల సాధనకు తోడ్పడే ఉద్దేశంతో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సెల్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ అతిథి మహబూబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ సుశ్రుత ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ మాలోతు రవీందర్ చౌకీదార్ విద్యార్థుల పోటీ పరీక్షల సన్నద్ధతకు ఉపయోగపడే విధంగా రూ.50,000/- విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను కళాశాలకు అందజేశారు.ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ బైరి సత్యనారాయణ అధ్యక్షత వహించగా, కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. సోమయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మాలోతు రవీందర్ చౌకీదార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగాలు, బ్యాంకింగ్, రైల్వే, గ్రూప్స్, సివిల్స్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, పోలీస్ తదితర పోటీ పరీక్షలలో విజయం సాధించాలంటే సమయపాలన, క్రమశిక్షణ, పటిష్టమైన పాఠ్య ప్రణాళిక, నిరంతర సాధన చాలా అవసరమని పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు గ్రామీణ నేపథ్యం నుంచే ఉన్నప్పటికీ, సరైన మార్గదర్శకత్వం వనరులు లభిస్తే ఉన్నత స్థానాలను అధిరోహించగలరని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తను కూడా ఇలాంటి నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిని అందు కోసమే తన స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యా, వైద్యానికి తన వంతు సహాయంగా తోడ్పాటు అందిస్తూ ముందుకు సాగుతున్నానని తెలిపారు.విద్యార్థి జీవితంలో పోటీ పరీక్షలు ఒక మలుపు. వాటిలో విజయం సాధించాలంటే కేవలం చదవడం సరిపోదు; పట్టుదల, సమయపాలన, ఆత్మవిశ్వాసం, నిరంతర సాధన కూడా అవసరం.నాకు సాధ్యమైనంత మేరకు విద్యార్థుల భవిష్యత్ కోసం చేయూతనందించడం నా బాధ్యతగా భావిస్తున్నాను.ఈ పుస్తకాలు చదివే ప్రతి విద్యార్థి ఒక మంచి ఉద్యోగం సాధించి, కుటుంబానికి, సమాజానికి, దేశానికి సేవ చేయాలని నేను ఆశిస్తున్నాను.విజయం అనేది ఒక్కరోజులో రాదు; ప్రతిరోజూ క్రమశిక్షణతో ముందుకు సాగిన వారికే విజయ శిఖరాలు అందుతాయి అని ముఖ్యంగా ఆడపిల్లలు చదువులలో ముందుండి సమాజాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బైరి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలంటే క్రమబద్ధమైన సాధన, సరైన మార్గదర్శకత్వం, మరియు నాణ్యమైన పుస్తకాలు ఎంతో అవసరం. అందుకే కళాశాలలో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సెల్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషదాయకమని విద్యార్థులు వచ్చిన అతిథుల నుంచి స్ఫూర్తి పొంది ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు.కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. సోమయ్య మాట్లాడుతూ మన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ సూచనల ఆధారంగా విద్యార్థుల కోసం కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగింది అని దీని ప్రధాన లక్ష్యం విద్యార్థుల్లో పోటీ పరీక్షల పట్ల ఆసక్తి పెంపొందించడం, వారిని ప్రారంభ దశ నుంచే సిద్ధం చేయడం, మరియు వారికి సరైన మార్గనిర్దేశం చేయడం. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం పోలీస్ శాఖకు సంబంధించిన ఉద్యోగాలపై అవగాహన కల్పించామని, కొనసాగింపుగా ఈ కార్యక్రమానికి పూనుకున్నామని,అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే ప్రతిరోజూ చిన్నచిన్న లక్ష్యాలతో ముందుకు సాగి,భవిష్యత్ విజయాలకు మార్గదర్శక చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ సత్యనారాయణ కందాల, స్టాఫ్ సెక్రటరీ ఎం.ఎం.కె. రహీముద్దీన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్. కమలాకర్, కెరీర్ గైడెన్స్ సెల్ సభ్యులు డాక్టర్ బద్రు భూక్య,ఎన్. ఎస్. ఎస్. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డా. రాంబాబు,ఎన్. సి. సి. ఆఫీసర్ డా. రాజీరు ఆర్. రుద్రాణి, గ్రంథాలయ పాలకులు గణేష్ తదితరులు పాల్గొని విద్యార్థులకు అమూల్యమైన సలహాలు, సూచనలు అందజేశారు.కళాశాల తరఫున డాక్టర్ మాలోతు రవీందర్ చౌకీదార్ కి రూ.50 వేల విలువైన పుస్తకాలను అందజేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతనందించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

- అధికారులకు వనతిపత్రం అందజేసిన మండల అధ్యక్షురాలు గోలి సంధ్య





**సంగెం,మార్చి30 (ప్రజాజ్యోతి):** ఆశవర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సోమవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశవర్కర్ల సంఘం అధ్యక్షురాలు గోలి సంధ్య ఆధ్వర్యంలో వైద్య అధికారి డాక్టర్ వంశీకృష్ణ,తహసిల్దార్ రాజుకుమార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వైద్యుధికారి ఆశా వర్కర్లతో చర్చించి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ..ఆశవర్కర్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆశ వర్కర్లకు కనీస వేతనం 18 వేలు అమలు చేస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినప్పటికీ ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.అయితే నేటి వరకు ఆ హామీలు అమలు కాలేదని అన్నారు.ఆశావర్కర్లు విధుల్లో మృతి చెందితే దహన సంస్కారాల 50వేలు అందజేయాలని అన్నారు.ప్రమాదవ శక్తి అనారోగ్యంతో చనిపోయిన ఆశాల స్థానంలో కుటుంబంలో అర్హులైన వారిని నియమించాలని డిమాండ్ చేశారు.2నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని పీఎఫ్, ఈఎస్ఐ వంటి ఉద్యోగ భద్రత,ప్రమాద బీమా సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు.ఏఎన్ఎం,జిఎన్ఎమ్ ట్రైనింగ్ చేసినవారికి వెయిటేజ్ మార్కులు కలిపి పోస్టులు భర్తీ చేయాలన్నారు.ఈ సమస్యల పై స్పందించిన వైద్య అధికారి వంశీకృష్ణ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బండి సుజాత,మచ్చ విజయ,కోతి కవిత,విజయ,సమ్మెట రాధిక,వేల్పుల పావని గడ్డం కళ్యాణి,ఝాన్సీ,గొనె రాధిక,పద్మ, సోలా ద్మ,కృష్ణవేణి,జ్యోతి,రమ,రజిత,సుమలత,శైలజ,యాదలక్ష్మి ,పూల,ముదురకోలా రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ నూతన గృహప్రవేశం

- హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**వెంకటాపురం,మార్చి 30 (ప్రజాజ్యోతి):** మొదటి దశలో మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తయిన సందర్భంగా గృహప్రవేశానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు.సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాత్రాపురంలో ఉప సర్పంచ్ కొప్పుల వెంకటేశ్వర్లు ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ సతీ సమేతంగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఇంటి యజమానుల చేత గృహప్రవేశం చేయించారు.అనంతరం హుస్సేన్ ఆయన సతీమణి ముంతాజ్ చేతుల మీదుగా గృహప్రవేశం చేసిన దంపతులకు నూతన వస్త్రాలను బహుకరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిడెం మోహన్ రావు,పాత్రాపురం సర్పంచ్ బొగ్గుల పుష్ప,శ్రీరాముల రమేష్,గుండమల్ల కిరణ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి కార్యకలాపాలు వేగవంతం

- జాగృతి జెండా ఎగరవేతకు పిలుపు





**నర్సంపేట మార్చి 30 (ప్రజా జ్యోతి)** నర్సంపేట చరిత్రలో చిరస్థాయిగా నిలిచే నిర్ణయం డాక్టర్ అనిల్ నాయక్‌కు తెలంగాణ జాగృతి అంగీకారం.నర్సంపేట రాజకీయ, సామాజిక వేదికపై ఒక కీలక మలుపుగా నిలిచే నిర్ణయం చోటుచేసుకుంది. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్ర ముఖ విద్యావేత్త డాక్టర్ అనిల్ నాయక్‌ను తెలంగాణ జాగృతి సంస్థలో హృదయపూర్వకంగా ఆహ్వానిస్తూ, ఆయనను అధికారికంగా తమ వర్గంలో చేర్చుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ సందర్భంగా మాట్లాడుతూ, నర్సంపేట నియోజకవర్గంలో డాక్టర్ అనిల్ నాయక్ సమర్థ నాయకత్వంతో గట్టిగా పనిచేసి, ప్రజల్లో చైతన్యం నింపాలని ఆకాంక్షించా రు.సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన కృషి మరింత బలోపేతం అవుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.బడుగు వర్గా లకు బలం జాగృతి వేదికపై కొత్త శక్తి డాక్టర్ అనిల్ నాయక్ చేరికతో నర్సంపేటలో తెలంగాణ జాగృతి కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి కొత్త దిశ దొరుకుతుందని నాయకులు పేర్కొన్నారు.ప్రజా సమస్యలపై పోరాట పంథాలో ముందుకు సాగుతూ, సామాజిక న్యాయం కోసం కట్టుబడి పనిచేయాలని పి లుపునిచ్చారు.జాగృతి జెండా ఎగురవేతకు పిలుపు ఈ సందర్భంగా కల్వకుం ట్ల కవిత, నర్సంపేటలో తెలంగాణ జాగృతి జెండా ఎగురవేసే దిశగా కార్యకర్త లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజల విశ్వాసాన్ని సంపాది స్తూ, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని ఆశీర్వదించారు.

## ఆర్టిజన్ కార్మికుల డిమాండ్లపై పోరాటం తీవ్రతరం

- ఏప్రిల్ 4న ధర్నా, 8 నుంచి నిరవధిక సమ్మె హెచ్చరిక

**గణపురం ప్రజాజ్యోతి మార్చి 30** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిసన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు కేటీపీపీ చెల్పూర్ ప్రధాన గేటు ముందు ఏప్రిల్ 4న నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర జెన్ కో చైర్మన్ జక్కుల రమేష్ హాజరై ఆర్టిజన్ కార్మికుల సమస్యలపై మాట్లాడారు. ఆర్టిజన్ కార్మికులకు వారి విద్యార్హతలను ఆధారంగా చేసుకుని కన్వర్షన్ కల్పించాలనీ, ఏపీ ఎస్ఈబీ నిబంధనలను అమలు చేయాలనీ, ఇంకా మిగిలిన కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.పై డిమాండ్లను ప్రభుత్వం , యాజమాన్యం తక్షణమే పరిష్కరించకపోతే ఏప్రిల్ 8 నుండి నిరవధిక సమ్మె చేపడతామని జేఏసీ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ చిలువేరు మల్లయ్య, కో–చైర్మన్ మామిండ్ల నాగరాజు, కో–కన్వీనర్ రెడ్డి ప్రణయ్, కేటీపీపీ జేఏసీ చైర్మన్ నరదాసు కృష్ణ, కన్వీనర్ ఇనుగాల కుమార్, కో–చైర్మన్లు ఓనపకాల సంపత్ కుమార్, శిరీష్ కుమార్, వైస్ చైర్మన్ కే నాగ రాజు, జాయింట్ సెక్రటరీ ఓ మహేష్, ఎం అనిల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీధర్, ఏ శ్రీనివాస్, ట్రెజరర్ జె మహేందర్, బొచ్చు శంకర్, భూమయ్య, వేణుగోపాల్ రావు, కుంట మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# గో అక్రమ రవాణా దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- ప్రధాన నిందితులపై పీడీ యాక్ట్ అమలు చేయాలి
- గో సంరక్షకులు
- జంగాలపల్లి లో పట్టుబడిన పశువులు
- పశువులు అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు
- ఎస్ ఐ ఉపేందర్

**ఏటూర్‌నాగారం మార్చి 30 ప్రజా జ్యోతి**

ములుగు జిల్లా పరిధిలో గో మాఫియా అక్రమ రవాణా కార్యకలాపాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. అధికారుల కళ్లకు గంతలు కట్టేలా పశువులను రహస్యంగా తరలిస్తూ, చట్టాలను తుంగలో తొక్కుతున్న ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా, సోమ వారం ఉదయం జంగాలపల్లి పరిసర ప్రాంతంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో ఈ అక్రమ రవాణా వ్యవహారం మరోసారి బయటపడింది.అధికారుల ఉత్తర్వుల మేరకు ములుగు



పోలీసులు చేపట్టిన తనిఖీలలో TS 36 T 5700 నంబర్ గల వాహనాన్ని జంగాలపల్లి క్రాస్ వద్ద ఆపి పరిశీలించగా, అందులో ఒక ఆవు, ఐదు ఎద్దులు కలిపి మొత్తం ఆరు పశువులను నిర్బంధించి తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి, పశువులను గోశాలకు తరలించారు. వాహనం యజమాని పశువులను తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఎస్సై యు. ఉపేందర్ రావు మాట్లాడుతూ, “ఎవరైనా చట్టవ్యతిరేకంగా పశువుల అక్రమ రవాణా చేసినట్లయితే కఠిన చర్యలు తప్పవు” అని హెచ్చరించారు.అయితే, గో మాఫియా కార్యకలాపాల వెనుక కొన్ని అనుమానాస్పద అంశాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. కొంతమంది అధికారులు అక్రమ రవాణా దారుల నుంచి ముడుపులు స్వీకరించి, వారిని ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు బహిర్గతమవుతున్నాయి. ఎన్ని సార్లు పట్టుబడినా అక్రమ రవాణాదారుల తీరు మారకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. గో మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలిఅక్రమ రవాణా దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.ప్రధాన నిందితులపై పీడీ యాక్ట్ అమలు చేయాలి.గో రక్షకులు, స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతూన్నారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కేవలం కేసులు నమోదు చేయడం మాత్రమే కాకుండా, గో మాఫియా నెట్వర్క్‌ను పూర్తిగా నిర్మూలించే దిశగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పశువుల రక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## గర్భ కోశ క్యాన్సర్ నివారణ వ్యాక్సినేషన్ సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్



**గణపురం ప్రజాజ్యోతి మర్చి 30** గర్భ కోశ క్యాన్సర్ నివారణ వ్యాక్సినేషన్ సద్వినియోగం చేసుకోవాలని గణపురం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ అన్నారు. సోమవారం గణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని డాక్టర్ అల్లూరి అనూష ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వ్యాక్సినేషన్ ప్రక్రియను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాధిక మాట్లాడుతూ 2011 ఫిబ్రవరి 01, ఫిబ్రవరి 01, 2012 మధ్యకాలంలో జన్మించిన వారు మాత్రమే వ్యాక్సినేషన్ వేసుకోవడానికి అర్హులని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం గణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజు వ్యాక్సినేషన్ మేడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఈ సందర్భంగా అన్నారు. మొదటిరోజు పది మందికి వ్యాక్సియేషన్ వేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం ఎల్ హెచ్ పి సుచరిత సూపర్వైజర్ ఎస్ రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ మడికొండ వేణు, ఎల్టి రజిత, డీఈఓ శ్రీలత ఏఎన్ఎంలు రజిత, సుజాత స్వర్ణలత, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ కారులను అరెస్టు చేసిన కొయ్యూరు పోలీసులు

- ఉద్యమ కారుల హామీలను నెరవేర్చాలి
- తెలంగాణ ఉద్యమ కారులు




**మల్హార్, మార్చి 30 ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల ఫోరం భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు యాదండ్ల గట్టయ్య యాదవ్, ప్రదాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్ ను సోమవారం కొయ్యురు పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా అధ్యక్షులు యాదండ్ల గట్టయ్య యాదవ్, ప్రదాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్ మాట్లాడుతూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం తమ సంఘం పిలుపు కాకున్న అరెస్టు చేయడం సరికాదన్నారు. ఇటీవల రెండు నెలల క్రితం రిజిస్ట్రేషన్ చేసుకున్న ఓ కొత్త ఉద్యమ కారుల సంఘం ప్రభుత్వాన్ని బదనాం చేసే కుట్ర చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం ఉద్యమ కారుల గుర్తింపుకై ప్రత్యేక కమిటీ వేస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. ఉద్యమ కారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మానిఫేస్టోలో పెట్టిన హామీలు నెరవేర్చాలని ఉద్యమ కారులకు పెన్షన్లు, 250 గజాల ఇంటి స్థలం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ట్రైన్, బస్ పాస్, హెల్త్ కార్డు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ కారుల అరెస్టు ను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఉద్యమ కారుల పట్ల ప్రభుత్వం నిర్బంధాలు మానుకొని సానుకులంగా స్పందించి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు



**ఏటూర్ నాగారం మార్చి 30 ప్రజా జ్యోతి** ఏటూర్ నాగారంలో “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో భాగంగా సోమ వారం ఉచిత కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది ఏటూర్‌నాగారం మండల కేంద్రంలోనీ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన అరైవ్ అలైవ్ ప్రోగ్రామ్లో భాగంగా ఏటూర్ నాగారం వై జంక్షన్ వద్ద ఉచిత కంటి చూపు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏటూర్ నాగారం సీఐ ఆధ్వర్యంలో, ఎస్ ఐ మహేష్ పోలీస్ సిబ్బంది కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ అనుముల శ్రీనివాస్ డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను నివారించడంలో కంటి చూపు ఎంతో ముఖ్యమని తెలిపారు. స్పష్టమైన చూపు లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అందువల్ల ప్రతి డ్రైవర్ తన కంటి ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలని సూచించారు.శిబిరంలో డ్రైవర్లు, వాహన యజమానులు స్థానిక ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ మహేశ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు